సాక్షి
గుంటూరు
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ముత్యాలమ్మ గుడికి శంకుస్థాపన

మంగళగిరి: యర్రబాలెం జంగాల కాలనీ లో ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ హనుమంత రావు గురువారం శంకుస్థాపన చేశారు.



ఖడ్గమాలార్చనలో కరికాల వలవన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు నిర్వహించే ఖడ్గమాలార్చన పూజలో దేవదాయశాఖ ప్రత్యేక పధాన కార్యదర్శి ఆర్.కరికాల వలవన్ గురువారం పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ బాపట్ల జిల్లా అధికారికి జేడీగా పదోన్నతి



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఎస్.మదన్‌మోహన్‌శెట్టికి జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమించింది.

న్యూస్‌రీల్

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: ఈనెల 27న పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు ఆర్టీసీ గుంటూరు-2 డిపో నుంచి రెండు స్పెషల్ హైటెక్ బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 25న రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 26న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి బయలుదేరి పౌర్ణమిరోజు ఉదయం అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. అరుణాచలేశ్వరుని దర్శించుకొని 27న సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి 28న ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుతాయని అన్నారు. ఈ సర్వీస్‌లకు 96164 , 96089 నంబర్ల ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రానుపోను ఒక్కో టికెట్ ధర రూ. 2,420 మాత్రమేనని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమాచారం కోసం 99592 25421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాల్ చేయగానే 108 అంబులెన్స్ చేరుకోవాలి



పెదకాకాని: ప్రజలు, రోగుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే 108 వాహనం అందుబాటులోకి వెళ్లాలని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ హనుమాన్ నాయక్ అన్నారు. 108, 104 వాహనాల తనిఖీలో భాగంగా అధికారులు గురువారం గుంటూరు జిల్లా పెదకాకాని చేరుకున్నారు. పెదకాకానిలో ఉన్న వాహనాలను తనిఖీ చేయడంతో పాటు ఆపరేషన్ పరికరాలు, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజల నుంచి సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించడంతో పాటు ఆసుపత్రికి చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం నాగదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,034, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,054, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.80 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 19,110 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 19,110 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 19,085 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,725 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76, బ్యాంక్ కెనాల్‌కు 279, తూర్పు కెనాల్‌కు 107, పశ్చిమ కెనాల్‌కు 25, నిజాంపట్నం కాలువకు 213, కొమ్మమూరు కాల్వకు 680 క్యూసెక్కులు విడుదల చేశారు.

సర్వే జనా సురక్ష

- ఆరోగ్య సురక్ష.. అద్భుత దీక్ష
- ఇళ్ల వద్దకే ఉచిత కార్పొరేట్ వైద్యసేవలు
- పైసా ఖర్చులేకుండా మందులూ పంపిణీ
- వేలాది మందికి కంటి ఆపరేషన్లు
- జీజీహెచ్‌లో ప్రత్యేక సమాచార కేంద్రం
- ఆరోగ్యశ్రీ జాబితాలో లేని రోగాలకూ చికిత్స



'కనుల' పండగ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి ఆపరేషన్లు చేయించుకున్న రోగులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పవిత్ర దీక్షలా దిగ్విజయంగా సాగుతోంది. పేద రోగులకు అండగా నిలుస్తోంది. వైద్యులు ఎక్కడికక్కడ వైద్యశిబిరాలు నిర్వహించి స్క్రీనింగ్ టెస్టులతోపాటు ఖరీదైన పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేసి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని కేసులు ఉంటే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేర్పించి వైద్యం అందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

6,29,103 కుటుంబాల సర్వే పూర్తి

జిల్లాలో 6,94,386 కుటుంబాలు ఉండగా, 6,29,103 కుటుంబాల సర్వేను వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిచేశారు. మొత్తం 15,75,704 మంది జనాభాకు 19,61,789 ఖరీదైన పరీక్షలు ఉచితంగా ఇంటి వద్దనే చేశారు.

36,298 మందికి కంటి పరీక్షలు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతాలలో 212, అర్బన్ ప్రాంతాలలో 223 కలిపి మొత్తం 435 వైద్యశిబిరాలు విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాలలో 82,743 మందిని, అర్బన్ ప్రాంతాలలో 79,676 మంది రోగులను డాక్టర్లు పరీక్షించారు. 36,298 మందికి కంటి పరీక్షలు చేశారు. 31 మందికి టీబీ పాజిటివ్ ఉన్నట్టు తేల్చారు. 457 మందికి లెప్రసీ ఉండచ్చన్న అవగాహనకు వచ్చారు. 8,160 కొత్త బీపీ, 4,986 కొత్త డయాబెటిక్ కేసులు గుర్తించారు. 2,543 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు.

మెరుగైన చికిత్సకు సిఫార్సు

3,079 కేసులకు మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. ఇందులో 2,229 కేసులను గుంటూరు జీజీహెచ్‌కు, 593 కేసులను జిల్లా ఆస్పత్రి తెనాలికి, మూడు కేసులు ఏరియా ఆస్పత్రులకు, 124 కేసులు సీహెచ్‌సీలకు, 116 కేసులు ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఇందులో ఇప్పటికి 466 మంది వివిధ ఆస్పత్రుల్లో చూపించుకోగా 33 మంది అడ్మిట్ అయ్యారు. 27 మంది వైద్యసేవల అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. రిఫరల్ కేసులకు సాయం అందించేందుకు ప్రత్యేక డెస్క్‌ను వైద్యాధికారులు ఏర్పాటు చేశారు. గుంటూరు గవర్నమెంట్ ఆస్పత్రిలో సమాచార కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోగులు ఆసుపత్రికి వచ్చినప్పుడు వారికి సాయం అందించేందుకు ప్రత్యేకంగా ఒక స్టూడెంట్ నర్స్‌ను కేటాయించారు.

జిల్లాలో ఇలా..	
మొత్తం కుటుంబాలు	: 6,94,386
సర్వే పూర్తయినవి	: 6,29,103
మొత్తం ఉచిత పరీక్షలు	: 19,61,789
మెరుగైన చికిత్స అవసరమైన వారు	: 3,079

రిఫరల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ

రిఫరల్ కేసులపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సాధారణంగా ఆసుపత్రుల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ వంటి సేవలు కొన్ని ప్రత్యేక రోజుల్లోనే అందుబాటులో ఉంటాయి. అయితే జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ రోగులకు ఈ సేవలను రోజూ అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. రోగులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ రిఫరల్ పేషెంట్ల ఆరోగ్యస్థితిని పరిశీలించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రిఫరల్ కేసులపై ప్రతి గురువారం వైద్యాధికారులు జిల్లా అధికారులకు, కలెక్టర్ కార్యాలయానికి నివేదిక అందజేయాలి. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో రైతులు, రైతుకూలీలు ఆస్పత్రులకు వచ్చేందుకు కొంత జాప్యం చేస్తున్నారు. వీరినీ ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందేలా ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణ

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో రిఫరల్ కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాము. దీని కోసం ఇప్పటికే గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేశాం. వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం లేకుండా వైద్య సేవలు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపి వైద్యం అందిస్తున్నాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్, గుంటూరు జిల్లా

శరవేగంగా కంటి ఆపరేషన్లు

36,298 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 20,908 మందికి కళ్లజోళ్లు అవసరమని, 2,543 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని, 440 మంది ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. రెండు ప్రభుత్వ ఆస్పత్రులు, రెండు స్వచ్ఛంద సంస్థలు, 12 నెట్‌వర్క్ ఆస్పత్రులకు కంటి ఆపరేషన్లు చేయించడానికి రిఫర్ చేశారు.



మహా మండపం వద్దకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

జై భవానీ.. జై జై భవానీ..

- దుర్గమ్మ సన్నిధిలో ఆరంభమైన మండల దీక్షలు
- ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు
- పగడాల మాలతో మూలవిరాట్ అలంకరణ
- అమ్మ సన్నిధిలో అఖండ దీపార్చన
- పౌర్ణమి వరకు మండల దీక్షల స్వీకరణ



భవానీ దీక్షలు చేపడుతున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధి మార్మోగింది. జగన్మాతా.. కరుణించమ్మా.. కాపాడు తల్లీ అంటూ భవానీలు పూజించారు. కార్తిక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం నుంచి అమ్మవారి మండల దీక్షలు ఆరంభమయ్యాయి. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు పూజలు నిర్వహించిన అనంతరం పగడాల మాలధారణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకొచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల జయజయనాదాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశస్థాపన చేసి అమ్మవారి ఆవాహన వంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈఓ కె.ఎస్.రామారావు, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, అర్చకులు, వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవ మూర్తికి దీక్ష మాలలను అలంకరించి అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల బద్రీనాథ్, ఉప ప్రధాన అర్చకులు వై.నాగరాజు శాస్త్రి, ఆచార్య గురు భవానీలు, ఈవో చేతుల మీదుగా భక్తులు దీక్షలను స్వీకరించారు. కార్తిక పౌర్ణమి సోమవారం వరకు భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

దీక్షల స్వీకరణకు తరలివచ్చిన భవానీలు

అమ్మవారి దీక్షలను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. పవిత్ర దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు దీక్షావస్త్రాలను ధరించి మాలధారణకు కొండపైకి చేరుకున్నారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌కు మాలలను చూపిన అనంతరం గురు భవానీల చేతుల మీదుగా మెడలో ధరించారు.

ఎల్ఎల్‌బీ కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ



ఎల్ఎల్‌బీ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతున్న ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల బ్రోచర్‌ను గురువారం వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రెండు దశాబ్దాల తరువాత యూనివర్సిటీ కళాశాలలో ఎల్ఎల్‌బీ కోర్సులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పేరుతో ప్రారంభించామన్నారు. ఈ ఏడాది బీఏ ఎల్ఎల్‌బీ హానర్స్, బీబీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సులకు అడ్మిషన్లు జరగనున్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉంటాయని వివరించారు. ఏపీ లాసెట్ నవంబర్ 17 నుంచి ప్రారంభించిన కౌన్సెలింగ్‌లో ఈ కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తున్నట్టు వివరించారు. ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వెబ్ ఆప్షన్స్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. లా సెట్‌లో కళాశాలలోని సీట్లు ఏమైనా మిగిలి ఉంటే ఈ విద్యా సంవత్సరంలో ఏపీ లా సెట్ రాయని వారికి, ర్యాంకు సాధించి కళాశాలలో సీటు పొందని వారికి చివర్లో కేటాయించనున్నట్టు వెల్లడించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతోపాటు ఉద్యోగ విరమణ చేసిన న్యాయ నిపుణులు, న్యాయమూర్తులు ఏఎన్‌యూ న్యాయ కళాశాలలో తమ సేవలు అందించనున్నారని వివరించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ విభాగాధిపతి ఎల్.జయశ్రీ, డాక్టర్ శ్రీగౌరీ, డాక్టర్ రమణ, డాక్టర్ ఎన్.సతీష్, డాక్టర్ కిషోర్, ఎస్.చంద్రశేఖర్, అభిలాష్, శశి కిరణ్ పాల్గొన్నారు.

నర్సింగ్ ఎన్నికలు వాయిదా

గుంటూరు మెడికల్ : ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి ఎన్నికల నామినేషన్లు వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఓటర్ల జాబితా నోటీసు బోర్డులో ప్రదర్శించ లేదు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి నామినేషన్లు వేయించాల్సి ఉంది. కాని ఎన్నికల అధికారులు కొన్ని జిల్లాలు కలిసి ఒక చోట నామినేషన్ వేయాలంటూ, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా నూతన విధానాలు తెరపైకి తెచ్చారు. దీంతో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం ఉన్నతాధికారులను కలిసి నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నికల ప్రక్రియ జరుగుతోందని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 25న జరగాల్సిన నర్సింగ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను వాయిదా వేస్తున్నామని ఎన్నికల అధికారి, గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాండురంగడికి వెండి కిరీటం బహూకరణ

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగస్వామికి నగరానికి చెందిన భక్తులు కొండపల్లి శివరామకృష్ణ, పెదబాబు వెండి కిరీటాన్ని గురువారం బహూకరించారు. నగరానికి చెందిన వీరు అన్ కట్ డైమండ్స్‌తో పొదిగిన రెండు కిలోల వెండి కిరీటాన్ని రూ. 6.5 లక్షల వ్యయంతో తయారు చేయించారు. ఈ కిరీటాన్ని పెదబాబుతోపాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) స్వామికి సమర్పించారు.

కల్యాణం.. క'మనీ'యం

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా సాయం జమ
- 348 జంటలకు లబ్ధి
- రూ.3.10 కోట్లు విడుదల



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా చెక్కును కొత్త దంపతులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తదితరులు

గుంటూరు వెస్ట్: పేద కుంటుంబాల్లో వివాహ భారాన్ని తన బాధ్యతగా భావిస్తూ ఆర్థిక చేయూతనందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం నాలుగో విడత నిధుల జమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్-2022 నుంచి ఈ పథకం రాష్ట్రంలో నిర్విఘ్నంగా కొనసాగుతోందన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, బీసీ, మైనారిటీలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు కూడా ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. ఒక్కొక్క జంటకు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షలు అందుతున్నాయన్నారు. ఈ మొత్తాన్ని నేరుగా వధువు తల్లుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేశారని పేర్కొన్నారు. జిల్లాలో 348 జంటలకు రూ.3.10 కోట్ల మేర ప్రయోజనం చేకూరినట్టు వెల్లడించారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 1,296 జంటలకు రూ.11.65 కోట్ల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ వధూవరులను ఆశీర్వదించారు. లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఝాన్సీ, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ ఆబిదా బేగం, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ కొత్త వధూవరులకు నమూనా చెక్కును అందజేశారు.

చాలా సంతోషంగా ఉంది



అమ్మ ఖాతాలోకి రూ.లక్ష వచ్చాయి. ఇంత మొత్తం గతంలో ఏ ప్రభుత్వం అందించలేదు. ఇక పేద వారు జగనన్నను చూసుకుని ధైర్యంగా జీవించవచ్చు. కరోనా కష్ట కాలంలోనూ మాకు సంక్షేమ పథకాలు నేరుగా అందించి ఆదుకున్నారు. ఎంతో ఆనందంగా ఉంది. జగనన్నను దేవుడు ఎల్లప్పుడూ చల్లగా చూస్తాడు.

– షేక్ సల్మా, షేక్ ఇర్ఫాన్ తాడికొండ

ఇంత త్వరగా వస్తాయనుకోలేదు



మా పెళ్లికి ముందు ప్రభుత్వ పథకం ద్వారా డబ్బులు వస్తాయని చెప్పారు. ఎక్కడా ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా చాలా త్వరగా డబ్బులు నా తల్లి ఖాతాలోకి వచ్చాయి. నిజంగా ఆశ్చర్యపోయాను. ఈ ప్రభుత్వానికి మాలాంటి ఎందరో జంటలు రుణపడి ఉంటాయి. ఆ రుణం తీర్చుకుంటాము.

– కె.షారోన్, సురేష్, నంబూరు


పేద ఇళ్లల్లో పెళ్లి అంత సులభం కాదు



పేద కుంటుంబాల్లో వివాహాలంటే అంత సులభం కాదు. జగనన్న అందించిన మొత్తంతో సగం పెళ్లి ఖర్చులకు వినియోగించాం. ముఖ్యంగా నా తల్లికి ఈ మొత్తం అందడంతో చాలా వరకు ఆర్థిక భారం తగ్గిపోయింది. ఈ పథకం భవిష్యత్తులోనూ కొనసాగాలని కోరుకుంటున్నా.

– కె.అంజలి, వెంకటేశ్వర్లు
చేబ్రోలు మండలం, శలపాడు గ్రామం

సంక్షేమ గళం



జగనన్న రుణం తీర్చుకోలేం



అట్టలు, కాగితాలు, సీసాలు, ప్లాస్టిక్ ఏరుకుని అవి అమ్మి జీవితాన్ని వెళ్లబుచ్చే పేదలం. రోజుకు రెండువందలు సంపాదించుకుని రేషన్ బియ్యంతో పిల్లలకు కడుపునిండా తిండి పెడితే చాలు అనుకుని తృప్తి పడ్డాం. పోరంబోకు స్థలంలో చిన్న గుడిసె వేసుకుని జీవించే మాకు సొంతిల్లు అనేది కలలో కూడా జరగని పని అనుకున్నాం. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇళ్లస్థల పట్టా ఇచ్చి ఇల్లు కట్టిస్తున్నారు. ఇక నుంచి సొంతింట్లో హాయిగా జీవించనున్నాం. జగనన్న రుణం తీర్చుకోలేం.

– మేకల వెంకటేశ్వరమ్మ, అంకమ్మరావు, అమరావతి

ఉచిత విద్య అద్భుతం

నాపేరు గూడూరి విజయ్‌కుమార్, భార్య అనూష. మాది కొత్తసాలన ఎస్సీకాలనీ. మాకు ఇద్దరు సంతానం. కూలి పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. బాబు చిన్నవాడు. కుమార్తె అమూల్య స్థానిక ఎంపీపీఎస్(ఏఏ)లో నాలుగో తరగతి చదువుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ఉచిత విద్య అద్భుతం. మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అందంగా మారాయి. అమ్మఒడి పథకం మాకు వరంగా మారింది. కాన్వెంట్ విద్యార్థులకు దీటుగా నా కుమార్తె చదువుతోంది. క్యాలీగ్రఫీలో నిష్ణాతులైన పాఠశాల హెచ్ఎం షేక్ జున్ను సాహెబ్ చేతిరాత, వేదగణితంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇంత మంచి విద్య అందిస్తున్న జగనన్నకు థ్యాంక్స్.



చక్కని చేతిరాత రాస్తున్న విజయ్‌కుమార్ కుమార్తె అమూల్య

– గూడూరి విజయ్‌కుమార్, కొత్తసాలన ఎస్సీకాలనీ

ఇంటికే వైద్యం బాగుంది



నా వయస్సు 66 ఏళ్లు. మారీసుపేటలో ఒంటరిగా ఉంటున్నా. భర్త గతంలోనే మృతి చెందారు. కుమార్తెకు పెళ్లయిపోయింది. నేను వంట పని చేస్తూ జీవిస్తున్నాను. ప్రభుత్వం ఇచ్చే పింఛన్, అప్పుడప్పుడు వంట పని ద్వారా వచ్చే కూలితో జీవిస్తున్నా. ప్రతినెలా వైద్యసిబ్బంది ఇంటికే వచ్చి ఆరోగ్యం గురించి వాకబు చేస్తున్నారు. అవసరమైతే వైద్యులూ ఇంటికి వస్తున్నారు. మందులు ఇస్తున్నారు. ఇటీవల కళ్ల సమస్య వచ్చింది. ప్రైవేటు ఆస్పత్రిలో చూపించే స్తోమత లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మా ఇంటి దగ్గరే ఏర్పాటు చేశారు. అక్కడకు వెళ్తే వైద్యులు చూసి కంటి చుక్కల మందు ఇచ్చారు. తగ్గిపోయింది. జగన్‌బాబుకు కృతజ్ఞతలు.

– కోట సావిత్రి, మారీసుపేట, తెనాలి

క్లుప్తంగా

'వికసిత్ భారత్' సభ ఏర్పాట్ల పరిశీలన

గుంటూరు రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభకు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం ఉదయం జరిగే సభకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి గురువారం జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో కలసి పరిశీలించారు. స్థానిక అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పటిష్ట బందోబస్తును పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, ఆర్డీవో శ్రీకర్ గురువారం సభ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంపు



నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి- 2024 పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈనెల 30వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ ఒకటి నుంచి 4వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 9వ తేదీ వరకు, రూ.500 తో డిసెంబర్ 14వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వివరించారు.

ఆన్‌లైన్‌లో ఎన్ఎంఎంఎస్ హాల్ టికెట్లు

2023–24 విద్యాసంవత్సరానికి గాను డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. www. breap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. గత ఏడాది 8వ తరగతి చదివే విద్యార్థులు 3,404 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది 3,004 మంది చేసుకున్నట్లు వివరించారు.

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు



రైతులకు రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అమరావతిలో జీడీసీసీ బ్యాంకు కొత్త బ్రాంచి ప్రారంభం

అమరావతి: సహకార బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసి కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తయారు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. స్థానిక జీడీసీసీ బ్యాంకు కొత్త బ్రాంచ్‌ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో సహకార బ్యాంకులు రైతులకు నామమాత్రంగా ఉపయోగపడేవని, ఇప్పుడు జగనన్న పాలనలో రైతు బిడ్డల విదేశీ విద్యకూ సహకారం అందిస్తున్నాయన్నారు. నూతన బ్రాంచ్ ఏర్పాటు సందర్భంగా ఇంటింటికీ సహకారం అన్న కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ సహకార బ్యాంకు సేవలను వివరిస్తామన్నారు. గుంటూరు జిల్లా సహకార బ్యాంకు గత టీడీపీ హయాంలో రూ.2,540 కోట్ల లావాదేవీలు జరిపితే, ఇప్పుడు రూ.6,077 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. అమరావతి బ్రాంచ్‌ని రూ.72 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయి నుంచి రూ.253 కోట్ల లావాదేవీలు జరిపే స్థాయికి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఐదు కోట్ల రూపాయల దీర్ఘకాలిక రుణాల చెక్కును నరుకుళ్ళపాడు, మునగోడు, పెదమద్దూరు పీఏసీఎస్‌ల తరఫున జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు తదితర రైతులకు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, రాష్ట్ర సహకార శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ రెడ్డి, నాబార్డు డీడీఎం శరత్, గుంటూరు జీడీసీసీ బ్యాంక్ సీఈఓ కృష్ణవేణి ఆప్కాబ్ జీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రబాబు

కొరిటిపాడు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్యానికి పూర్వమే 1923లోనే ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించి తెలుగువారి దక్షతను, కీర్తిని, దశదిశలా వ్యాప్తి చేసి చిరస్మరణీయులయ్యారని యూనియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రా బ్యాంక్ శతాబ్ది ఉత్సవాల్ని పురస్కరించుకొని ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో పట్టాభి సీతారామయ్యకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ రవీంద్రబాబు మాట్లాడుతూ రూ. వెయ్యితో ప్రారంభించిన ఆంధ్రా బ్యాంక్ 2020కి యూనియన్ బ్యాంక్‌లో విలీనానికి పూర్వం దేశ విదేశాల్లో మూడు వేల శాఖలకు విస్తరించి మూడు లక్షల కోట్ల రూపాయలు వ్యాపారం నడిపిందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయం, విద్య, పారిశ్రామిక, వ్యాపార రంగాల విస్తరణలో గణనీయమైన పాత్ర పోషించిందని తెలియజేశారు. రీజినల్ హెడ్ కుందన్‌లాల్ మాట్లాడుతూ బ్యాంకు పురోభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర గణనీయమని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రా బ్యాంక్ మానస పుత్రిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ గ్రామీణ ప్రజల వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సభకు ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కె.హరిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు పి.శ్రీనివాస్, బి.ఎస్. రామారావు, వి.బ్రహ్మానందరెడ్డి, నీలమణి పాటిల్, శ్రీనివాసశాస్త్రి, బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వి.వి. కొండలరావు, చైర్మన్ ఎం.బి.శంకరరావు, జిల్లా సంఘ నాయకులు వై.కోటేశ్వరరావు, ఎస్.గణేష్, ఎం.పి.పుల్లయ్య, వై. హనుమంతరావు పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనలో అంబేడ్కర్ కృషి ఎనలేనిది

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

నెహ్రూనగర్: మహిళల హక్కుల సాధనలో అంబేడ్కర్ కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఐడియా(ఐడియల్ దళిత్ ఎంప్లాయీస్ అసోసియేషన్) సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా అవగాహనతో పాటు బహుజన ప్రయోజనకారి కులగణనపై కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన కోసం అంబేడ్కర్ కృషి చేశారన్నారు. ముఖ్యంగా హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తూ తన న్యాయశాఖ మంత్రి పదవి కూడా రాజీనామా చేశారని గుర్తు చేశారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానంగా ఓటు హక్కు కల్పించి రాజ్యాధికారాన్ని దగ్గర చేశారని వివరించారు. ఓటు అనేది చాలా విలువైనదని, దాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యక్షుడు డాక్టర్ గోళ్ల మూడి రాజా సుందర బాబు మాట్లాడుతూ కులగణన అనే చారిత్రకమైన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఐక్య రాజ్యసమితి అంబేడ్కర్‌ను ప్రపంచ విమోచకుడిగా ప్రకటించి 'జై భీమ్' అనే నినాదం ఇవ్వడంపై బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు తిప్పబత్తుని గోవింద్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ నాయక్, ఐడియా రాష్ట్ర అధ్యక్షుడు ఐడీబీ నాయక్, క్రైస్తవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు, పెద్ద గొట్టిపాడు, పెద్ద మక్కెన ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'తెనాలి డబుల్ హార్స్'కు అవార్డు

తెనాలి: స్థానిక డబుల్ హార్స్ గ్రూప్ సుస్థిరమైన ప్యాకేజింగ్ ఆవిష్కరణకు ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రతిష్టాత్మకమైన మేక్ ఇన్ ఇండియా ఇనీషియేటివ్ అవార్డు–2023ను గెలుచుకుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ ఈ గౌరవాన్ని స్వీకరించారు. ప్యాకేజింగ్ పరిశ్రమలో సుస్థిర అభ్యాసాల కోసం సంస్థ చేస్తున్న అత్యుత్తమ ప్రయత్నాలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోహన్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థ అనుసరిస్తున్న సుస్థిరమైన ప్యాకేజింగ్ కార్యక్రమాలకు ఎంఎస్ఎంఈసీసీచే గుర్తింపు పొందటం గర్వకారణమన్నారు. మేక్ ఇన్ ఇండియా ఆవిష్కరణల సాధన లక్ష్యంలో తమ కృషికి, ఈ అవార్డు మరింత ప్రోత్సాహకరమని చెప్పారు.



బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరానికి వచ్చిన విద్యార్థినులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

- వెంకటకృష్ణాపురంలో అనూహ్య స్పందన
- కంటి పరీక్షలకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడి



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: మండలంలోని వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం గ్రామాల్లో గురువారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని స్థానిక పెద్దలతో కలసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కలలను, తన ఆశయాలుగా స్వీకరించి, రాష్ట్ర చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఏడాది పొడవునా సంక్షేమ కార్యక్రమాల పరంపర కొనసాగిస్తూ బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా ప్రకటించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత 11 నెలల కాలంలో 11,615 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు అందజేశామని పేర్కొన్నారు. పరీక్షలు జరిపిన ఏడు రోజుల్లో అక్కడే కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం నేత్రజ్యోతి ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించడానికి ముందుగానే వెంకటకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో బజరంగ్ సేవా విభాగం బృందం పర్యటించి, ఇంటింటికీ ప్రచారం చేసినట్లు చెప్పారు. శిబిరానికి వచ్చిన 673 మందికి దగ్గరుడి వైద్య పరీక్షలు చేయించినట్లు వివరించారు. గుంటూరు ట్రికాన్ క్లినిక్ సహకారంతో 106 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించామని తెలిపారు. ప్రధానంగా తమ వైద్య శిబిరానికి వెంకటకృష్ణాపురంలో అనూహ్య స్పందన లభించడం విశేషమని అంబటి మురళీకృష్ణ చెప్పారు. స్థానిక స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి కంటి పరీక్షలు చేయించామని, వృద్ధులు, వికలాంగుల రాకపోకల కోసం ప్రత్యేక వాహనాల్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశామని ఆయన చెప్పారు.

అప్సా జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఎన్నిక



మురళీమోహన్‌రావు పేరిరెడ్డి రాజేష్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాదినేని మురళీమోహన్‌రావు, భీమనాథం పేరిరెడ్డి, కోశాధికారిగా కేసీవై రాజేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏటీ అగ్రహారంలోని విజేత స్కూల్లో గురువారం జరిగిన అప్సా జిల్లా శాఖ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర కోశాధికారి సీహెచ్. శ్రీహరి అధ్యక్షత వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు మేకల రవీంద్రబాబు, వీఆర్ఎం శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. సమావేశంలో వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు కె. రాజేష్, సీహెచ్. శ్రీనివాసరావు, తేజ సురేష్, బత్తిన వెంకట్రావు, రఘు, వివిధ పాఠశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని శబరిమలై భక్తుల సౌకర్యార్థం డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. రైలు నంబర్ 07143 (సికింద్రాబాద్-కొళ్ళం) డిసెంబర్ 15, 29వ తేదీలలో నడుస్తుందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 07.30 గంటలకు కొళ్ళం స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఇదే రైలు తిరిగి (07144) సికింద్రాబాద్‌కు డిసెంబరు 16, 30వ తేదీలలో నడుస్తుందని వివరించారు. ఈ రైలు కొళ్ళం నుంచి రాత్రి 11 గంటలకు బయలు దేరి మరుసటి తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు చర్లపల్లి, మిరియాలగూడ, విష్ణుపురం, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జొలార్‌పట్టి, ఇరోడ్, త్రిపూర్, పలకడ్, త్రిసూర్ ఎర్నాకులం టౌన్, కొట్టాయం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. 07147 (హైదరాబాద్-కొట్టాయం) రైలు డిసెంబర్ 02,09వ తేదీలలో సాయంత్రం 6 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 10.05 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07148 కొట్టాయం-హైదరాబాద్ రైలు డిసెంబర్ 04,11వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. ఈ రైలు రాత్రి .12.30 గంటలకు కొట్టాయం స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 04.15 గంటలకు హైదరాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ

అధికారులకు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశం

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఎస్ఎస్ఆర్–2024 డ్రాఫ్ట్ జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఫోటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నంబర్ లేకుండా పూర్తిస్థాయిలో సవరణ చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్వోలు కచ్చితంగా వెళ్లాలని సూచించారు. పరిశీలించిన క్లెయిమ్స్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరంభమైన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్

వర్షం కారణంగా వర్సిటీ క్రీడా ప్రాంగణానికి వేదిక మార్పు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో గురువారం సాయంత్రం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి అండర్-14 అంతర్ జిల్లాల బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు ప్రారంభమైన సమయానికి వర్షం రావడంతో బాలికల డిస్కస్‌త్రో, షాట్‌పుట్, బాలుర షాట్‌పుట్ పోటీలను మాత్రమే నిర్వహించారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా పోటీల వేదికను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణానికి మార్చు చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధుల అభ్యర్థనను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అంగీకరించి పోటీలను నిర్వహించుకునేందుకు అనుమతించినట్టు ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చప్పల్లి కోటేశ్వరరావు తెలిపారు.

పోటీల విజేతల వివరాలు..

- అండర్-14 బాలికల షాట్‌పుట్ పోటీలో ఎస్.చాందిని (తూర్పుగోదావరి) 8.07 మీటర్లు విసిరి ప్రథమ స్థానం, బి.పుష్ప (వైఎస్సార్ కడపజిల్లా) 7.39 మీ., సుగాలి కోవెల (అనంతపురం) 7.14మీ. విసిరారు.
- డిస్కత్రోలో ఎస్.చాందిని (తూర్పుగోదావరి) 24.40 మీటర్లు విసిరి ప్రథమ స్థానం, బి.పుష్ప (వైఎస్సార్ కడప జిల్లా) 21.05మీ., బి.వి.జ్యోతి (ప్రకాశం జిల్లా) 19.65మీ. విసిరారు.
- అండర్-14 బాలుర షాట్‌పుట్ పోటీలో బి. అశ్విన్ (కృష్ణాజిల్లా) 11.33మీ, ఆర్.వెంకటహర్షవర్ధన్ (గుంటూరు) 10.93మీ, కె.సురేష్‌పాడల్ (విశాఖ) 10.80 మీటర్లు విసిరారు.

ఏపీలో గ్రామసమాఖ్యలు, డ్వాక్రాగ్రూప్‌ల పనితీరు భేష్

- గుజరాత్, హరియాణా ఐఏఎస్ అధికారుల బృందం వెల్లడి
- తాడికొండ మండలంలో పర్యటన



పాములపాడులో డ్వాక్రా గ్రూపుల పనితీరును అడిగి తెలుసుకుంటున్న ఐఏఎస్ అధికారుల బృందం

తాడికొండ: ఏపీలో గ్రామ సమాఖ్యలు, డ్వాక్రా గ్రూపుల పనితీరు బాగుందని గుజరాత్, హరియాణా చెందిన ఐఏఎస్ అధికారుల బృందం ప్రశంసించింది. ఏపీలో డ్వాక్రా సంఘాలను పరిశీలించేందుకు విచ్చేసిన ఈ బృందం తాడికొండ మండలం పాములపాడు, పొన్నెకల్లు గ్రామాల్లోని పలు డ్వాక్రా సంఘాలు, గ్రామ సమాఖ్యలను సందర్శించింది. సంఘాలు బలోపేతమై పలు వ్యాపారాలు నిర్వహించి విజయవంతంగా ఎలా నడుపుతున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమాఖ్యలు, డ్వాక్రా సంఘాలకు బ్యాంకు ఇస్తున్న రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ ఎంత ? వీటి ద్వారా రుణం తీసుకొని ఏఏ వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా నెలకు ఎంత ఆదాయం సంపాదిస్తున్నారు ? అనే విషయాలను తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు. వీరు పరిశీలించిన గ్రామాల్లోని పలు డ్వాక్రా మహిళలు, సమాఖ్యల పనితీరు నచ్చడంతో పాములపాడు గ్రామ సమాఖ్యకు రూ.5 వేలు, జోసఫ్ డ్వాక్రా మహిళా గ్రూపుకు రూ.3 వేలు పారితోషికం అందజేశారు. పర్యటనలో గుజరాత్ నవాసరి జిల్లా డెవలప్‌మెంట్ అధికారిణి పుష్పలత (ఐఏఎస్), నవాసరి జిల్లా మేనేజర్ వడ్ల మయూరి, రాజ్‌కోట్ జిల్లా మేనేజర్ వీరేంద్ర బాసల్య, జనరల్ మేనేజర్ శ్రీ ఓం దేవి సిన్హ చుడాస్మా, పాములపాడు సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, డీపీఎం జాగర్లమూడి రాంబాబు, సెర్ప్ డీజీఎం కేశవ్, ఏరియా కో–ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, ఏపీఎం సాంబశివరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.